కాగుపాడు సర్పంచిపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కాగుపాడు పంచాయతీ సర్పంచి కడియాల సుధేష్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీలో పలు ఆర్థిక అవకతవకలు జరిగాయని వార్డు సభ్యుడు వంకిన మాధవరావు చేసిన ఫిర్యాదు ఆధారంగా అధికారులు విచారణ నిర్వహించారు. ఈ క్రమంలో ఆమెను సర్పంచి బాధ్యతల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఉప సర్పంచి పొట్ల ఏడుకొండలుకు ఇన్‌ఛార్జి సర్పంచిగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారని పంచాయతీ కార్యదర్శి సూరత్తుల దుర్గాధర్ పేర్కొన్నారు.



వంటింట్లో మోడీ మంట..!

గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచిన కేంద్రం

నేటి నుంచి అమలు

45 రోజులకు ఒక సిలిండర్ వాడితే ఉమ్మడి జిల్లా వినియోగదారులపై ఏడాదికి రూ.32 కోట్ల భారం

బిజెపి ప్రభుత్వం తీరుపై జనం రుసరుసలు

ప్రజాశక్తి - భీమవరం

మొన్నటి వరకూ మహిళలు ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం ఎదురుచూశారు. ఇది అమల్లోకి వచ్చిన కొన్ని రోజుల వ్యవధిలోని గ్యాస్ సిలిండర్ ధర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మోడీ ప్రభుత్వం వంటింట్లో మంట పెట్టినట్లయ్యింది. గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచుతున్నట్లు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖా మంత్రి హర్దీప్‌సింగ్‌పురీ ప్రకటించారు. ఈ ధరల పెంపు ఉజ్వల పథకం లబ్ధిదారులకు సైతం వర్తిస్తుందని తెలిపారు. ఈ నెల ఎనిమిదో తేదీ మంగళవారం నుంచి పెంపు అమల్లోకి వస్తుందని ప్రకటించారు. మరోపక్క పెట్రోల్, డీజిల్‌పై రూ.2 చొప్పున ఎక్సైజ్ డ్యూటీని కేంద్రం పెంచింది. ఈ పెంపును ఆయిల్ కంపెనీలకే వర్తిస్తుందని, వినియోగదారులపై పడబోదని తెలిపింది. అయితే ఏదోక సమయంలో వినియోగదారులపై పెట్రో ధరల భారం పడుతుందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే గత వారంలో వాణిజ్య సిలిండర్ ధరను రూ.41 మేర తగ్గించింది. ఈ నేపథ్యంలో గృహావసరాల వంట గ్యాస్ ధర తగ్గుతుందని అంతా భావిస్తుండగా రూ.50 పెంచడం అందరినీ నిర్ఘాంతపర్చింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు ఎనిమిది లక్షలకుపైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. గృహ వినియోగదారుల గ్యాస్ సిలిండర్ ధర రూ.833, వాణిజ్య సిలిండర్ ధర రూ.1,950 ధరగా ఉంది. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో ఆ భారం వినియోగదారునిపైనే పడుతుందని పరిశీలకులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం కింద ప్రస్తుత మొదటి క్వార్టర్‌లో ఒక సిలిండర్ ఇవ్వాల్సి ఉండగా గతంలో వలె సొమ్ము జమ చేస్తుందని, పెరిగిన సొమ్ము ఇచ్చే అవకాశం లేదని చెబుతున్నారు. ఈ విధంగా చూస్తే వినియోగదారులపై రూ.50 భారం పడక తప్పదు. సగటున ఒక్కో వినియోగదారుడు 45 రోజులకు ఒక సిలిండర్ వాడితే సంవత్సరం మొత్తంగా ఎనిమిది సిలిండర్లు వినియోగించే అవకాశం ఉంది. అంటే ఒక్కో వినియోగదారునిపై సగటున సంవత్సరానికి రూ.400 చొప్పున భారం పడనుంది. ఉమ్మడి జిల్లాలో వినియోగదారులపై సంవత్సరానికి రూ.32 కోట్లు అదనపు భారం పడుతుంది. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలతో సతమతమవుతున్న వినియోగదారులకు గ్యాస్ ధర పెంపు గోరుచుట్టుపై రోకటిపోటులా పరిణమించిందనే చెప్పొచ్చు. మోడీ సర్కార్ తీరుపై మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

గ్యాస్ సిలిండర్ ధర పెంపు సరికాదు

సాదే నాగరాజు, మోగల్లు, పాలకోడేరు మండలం

ఉచిత గ్యాస్ సిలిండర్ అన్నారు. సబ్సిడీ ఇస్తామన్నారు. ఇది పూర్తిస్థాయిలో అందకుండానే గ్యాస్ ధర పెంచారు. ఇదెక్కడి దారుణం. కేంద్ర ప్రభుత్వం తరచూ గ్యాస్ ధర పెంచడం సరైంది కాదు. ఇప్పటికే పెరిగిన వస్తువుల ధరలతో సతమతమవుతున్నాం. వీటిని తగ్గించాల్సిందిపోయి గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధర పెంచడం సమంజసం కాదు. తక్షణం గ్యాస్ సిలిండర్ ధర పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

గ్యాస్ ధర ఎన్నిసార్లు పెంచుతారు..

కె.రామలక్ష్మి, గృహిణి, భీమవరం

గ్యాస్ ధరలు ఇప్పటికే రెండు, మూడుసార్లు పెంచారు. ప్రస్తుతం రూ.833 చెల్లిస్తున్నాం. ఇది చాలదన్నట్లు అదనంగా మరో రూ.50 పెంచడం దారుణం. అసలు గ్యాస్ సిలిండర్ ధర ఎన్నిసార్లు పెంచుతారు. ఇలా పెంచుకుంటూపోతే సామాన్య ప్రజానీకం ఎలా బతుకుతారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం గ్యాస్ ధర పెంపును ఉపసంహరించుకోవాలి.

పుల్లల పొయ్యే గతి..

మేడే నరేష్, ఆటో డ్రైవర్, వీరవాసరం

ఒకపక్క కిరాణా సరుకుల ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. ఇప్పటికే విద్యుత్ ఛార్జీల భారం తట్టుకోలేని పరిస్థితి ఉంది. ఇప్పుడు గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడం దారుణం. ఇది మాలాంటివారికి మోయలేని భారమే. ఇక పుల్లల పొయ్యేగతి.

నొప్పి తెలియకుండా భారాలు మోపుతున్నారు..

గుడాల మీనా, వీరవాసరం

నా భర్త రోజువారీ చేపల వ్యాపారి. ప్రస్తుతం మా వ్యాపారం అంతంత మాత్రమే. ఒక్కో రోజు పెట్టుబడి కూడా రాని పరిస్థితి. అంత కంతకూ గ్యాస్ ధర పెంచుకుంటూపోతూ నొప్పి తెలియకుండా భారాలు మోపుతున్నారు. దీనివల్ల కుటుంబం గడవడం కష్టంగా మారుతోంది. ఇలా అయితే మేం ఎలా బతకాలి.

గ్యాస్ ధర పెంపు పెనుభారమే..

మడకం సుధారాణి, గృహిణి, రామమ్మగూడెం, టి.నర్సాపురం మండలం

గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచడం అత్యంత దారుణం. నిత్యావసరాల ధరలు తగ్గించాలని కోరుతుంటే పట్టించుకోని ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర పెంపుతో మరోభారం మోపడం అన్యాయం. వెంటనే పెంచిన ధరలు తగ్గించాలి.

సామాన్యులు బతికేదెలా..

ఎం.కుమారి, ఎఎస్ఆర్ నగర్, టి.నర్సాపురం మండలం

ప్రభుత్వాలు ఇష్టాను సారం ధరలు పెంచు కుంటూ పోతే సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎలా బతకాలి. ఇక కట్టెల పొయ్యిలే గతి. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ధరలు పెంచుతుందే తప్ప తగ్గించే ఆలోచన చేయడం లేదు. పెంచిన ధరలు వెంటనే తగ్గించాలి.

11న సిఎం పర్యటనకు సర్వసన్నద్ధంగా ఉండాలి

అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశం

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు నియోజకవర్గంలో ఈ నెల 11న ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ కార్యక్రమాల్లో పాల్గొనవచ్చునని, ఈ దృష్ట్యా వివిధ శాఖల అధికారులందరూ తమ శాఖలకు సంబంధించి అన్ని వివరాలనూ సిద్ధంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. నియోజకవర్గంలో ముఖ్యమంత్రి పర్యటనా ఏర్పాట్లపై స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆమె అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఈ నెల 11న నూజివీడు నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాలతోపాటు పి4 కార్యక్రమంలో భాగంగా నిరుపేద కుటుంబాలను కలిసి వారి సమస్యలు తెలుసుకునే కార్యక్రమం, అనంతరం ప్రజావేదికలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం ఉందన్నారు. గ్రామంలోని అత్యంత నిరుపేదల వివరాలు, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితి, వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలను సిఎం అడిగే అవకాశం ఉందని, సంబంధిత శాఖల అధికారులందరూ తమతమ శాఖలకు సంబంధించిన వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. బిసి రుణాలు పంపిణీ చేసే అవకాశం ఉన్నందున సంబంధిత శాఖల అధికారులు లబ్ధిదారులను, రుణాల మంజూరు చెక్కులను సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లా, నియోజకవర్గ స్థాయిలో స్వర్ణాంధ్ర విజన్ -2047 కు సంబంధించి రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. స్థానికంగా రైతులు, మామిడి తదితర ఉద్యాన పంటలకు సంబంధించిన వివరాలు, వాటి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, జెడ్‌పి సిఇఒ కె.భీమేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ముక్కంటి, డిపిఒ కె.అనురాధ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు రీఓపెన్ కాకుండా పరిష్కారం ఉండాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి, సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలు రీఓపెన్ కాకుండా వాటి పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పిజిఆర్ఎస్‌లో ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌తో కలిసి ఆమె అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి అందిన అర్జీలను పరిశీలించి నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరిష్కారానికి వీలుగాని అర్జీలను అందుకు గల కారణాలను స్పష్టంగా దరఖాస్తుదారునికి తెలియజేయాలన్నారు. నూజివీడుకు చెందిన గోళ్ల వాసు తన దరఖాస్తులో నూజివీడు సుంకొల్లు బైపాస్ రోడ్డు నిమిత్తం తన భూమిని సేకరించారని, పరిహారం ఇంకా అందించలేదని కోరారు. ముసునూరు మండలం కాత్రేనిపాడుకు చెందిన రావిపార్ల బాలకష్ణ తన దరఖాస్తులో నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టులో తమ గ్రామానికి చెందిన ఇద్దరు రైతులకు పరిహారం అందించని కారణంగా కాలువ తవ్వకం పనులకు అంగీకరించడం లేదని, వారికి పరిహారం అందించి సాగునీటి సమస్య లేకుండా చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కె.భీమేశ్వరరావు, డిపిఒ కె.అనురాధ, డిసిఒ ఎ.శ్రీనివాస్, బిసి కార్పొరేషన్ ఇడి పుష్పలత, గృహ నిర్మాణ శాఖ పీడీ సత్యనారాయణ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ త్రినాథ్‌బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏలూరు: పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని డిఆర్ఒ విశ్వేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, కలెక్టరేట్ ఎఒ ఎన్‌వి.నాంచారయ్య, వివిధ శాఖల అధికారులతో కలిసి డిఆర్ఒ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలు పరిశీలించి నిర్ణీత గడువులోగా అర్థవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను సమర్థవంతంగా పరిష్కరిస్తే అదే ఫిర్యాదు మళ్లీ రాదని, దీనిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. సోమవారం పిజిఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి 333 దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో డిఎల్‌డిఒ ఎబిపివి.లక్ష్మీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆగని గాలి, వాన బీభత్సం

ఏజెన్సీ, మెట్ట ప్రాంతంలో మరోసారి ప్రభావం

లబోదిబోమంటున్న రైతులు

ప్రజాశక్తి - ముసునూరు

సోమవారం సాయంత్రం జిల్లాలోని ఏజెన్సీ, మెట్ట ప్రాంతాలతోపాటు నూజివీడు పరిసరాల్లోనూ గాలి, వాన భీభత్సం సృష్టించింది. ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడిందని జనం సేదతీరే లోపు బలమైన ఈదురుగాలులు జనాలను బెంబేలెత్తిస్తున్నాయి. రెండు రోజుల క్రితం చింతలపూడి పరిసరాల్లో గాలులు తీవ్ర నష్టాన్ని మిగిల్చిన సంగతి తెలిసిందే. అది మరువకముంటే సోమవారం సాయంత్రం గాలులు మరోసారి విరుచుకుపడ్డాయి. దీంతో రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మండలంలోని ముసునూరు, గోపవరం, వలసపల్లి, లోపూడి తదితర గ్రామాల్లో అకాల వర్షం కురవడంతో చేతికొచ్చిన పంట నష్టపోయే ప్రమాదం ఉందని మిర్చి రైతులు వాపోయారు. పొగాకు పరిస్థితీ అదే. దీనికితోడు గాలుల వల్ల పలుచోట్ల చెట్లు నేలనంటాయి. దీంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు.

నూజివీడు టౌన్: పట్టణ పరిధిలో సోమవారం సాయంత్రం అనుకోని విధంగా వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ మండు వేసవిని తలపిస్తూ ఉన్న వాతావరణం సాయంత్రం హఠాత్తుగా వాతావరణం చల్లబడి ఈదురుగాలులతో ఒక మోస్తరు వర్షం కురిసింది. గాలులు వల్ల నష్టం వాటిల్లుతుందని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముసునూరు: లోపూడిలో నేలరాలిన మామిడి

చింతలపూడి: మండలంలో సోమవారం సాయంత్రం అకాల వర్షం, గాలి దుమ్ము విరుచుకుపడ్డాయి. మొక్కజొన్న, మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. చెట్లు నేలనంటాయి. ఆంథోనీ నగర్ వద్ద చెట్టు కొమ్మలు రహదారిపై విరిగి పడటంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. సాధారణ సీడ్ మొక్కజొన్న విరిచి పొలాల్లో ఆరబెట్టిన రైతులకు నష్టం తప్పదని చెబుతున్నారు. కొన్ని చోట్ల ఇళ్ల రేకులు విగిరిపోయి, పగిలిపోయిన పరిస్థితి నెలకొంది.

జీలుగుమిల్లి: మండలంలో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మేఘావృతమై వర్షం కురిసింది. పలుచోట్ల ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. గాలులకు భారీవృక్షాలు సైతం నేలకొరిగాయి. పలుచోట్ల విద్యుత్ తీగలు తెగి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

చింతలపూడి మండలంలో ఎగిరిపోయిన రేకులు

జీలుగుమిల్లి మండలంలో విద్యుత్ తీగలపై పడిన చెట్టు

ముసునూరు: చింతలవల్లి రోడ్డులో కూలిన చెట్టు

వార్డు సచివాలయాల్లో ఎంఎల్ఎ ఆకస్మిక తనిఖీ

సిబ్బంది పనితీరుపై అసంతృప్తి



సిబ్బందిని ప్రశ్నిస్తున్న ఎంఎల్ఎ చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మెరుగైన పారిశుధ్య పరిస్థితులే ఆరోగ్యకర వాతావరణానికి సూచికలని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరు నగరంలోని పలు సచివాలయాలను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పరిస్థితులపై ఎంఎల్ఎ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాక్షేమమే తనకు ముఖ్యమన్నారు. సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని, బినామీలు విధుల్లో ఉండటం ఎంఎల్ఎ గుర్తించి ఆయా సిబ్బందిపై ఎంఎల్ఎ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయి పరిస్థితుల్లో మార్పురాకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. అనంతరం ఆయా డివిజన్లలోని శానిటరీ సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, పర్మినెంట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఎంఎల్ఎ చంటి మాట్లాడుతూ నగరంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైన సిబ్బందిని నియమించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో అపారిశుధ్య పరిస్థితులు ఎక్కడైనా కనిపిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, అదనపు కమిషనర్ చంద్రయ్య, రాష్ట్ర మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

జిల్లాలో అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతున్నట్లు ఏలూరు జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివ కిషోర్ స్పష్టం చేశారు. నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి విలేకరులతో మాట్లాడుతూ గంజాయి బ్యాచ్, ఆకతాయి చేష్టలకు పాల్పడే అగంతకులను విడిచి పెట్టే ప్రసక్తి లేదన్నారు. ఓపెన్ డ్రింకింగ్, ఇతర వ్యసనాలకు బానిసలుగా మారి దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతున్న సంఘటనలు తమ దృష్టికి వచ్చాయన్నారు. ఇప్పటికే అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించి డ్రోన్లతో అసాంఘిక శక్తుల కదలికలకు కళ్లెం వేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో పోలీసు సిబ్బంది తక్కువగా ఉన్న మాట వాస్తవమేనని, సిబ్బంది నియామకానికి సంబంధించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. వ్యాపార సంస్థలు, ఇళ్ల వద్ద, నాలుగు రోడ్ల కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి చేయాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందన్నారు. పి4లోనే నేరాల నివారణ కోసం సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. నూజివీడు పట్టణ పరిధిలోని ట్రిపుల్ ఐటీలో జరిగిన దొంగతనాలు తన దృష్టికి వచ్చాయన్నారు. త్వరలోనే నూజివీడుకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, సిసిఎస్ పోలీస్ స్టేషన్లు మంజూరవుతాయన్నారు. త్వరలోనే నూజివీడు డిఎస్‌పి కార్యాలయ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. పట్టణంలో విద్యాసంస్థలు, రోడ్లపై ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని డిఎస్‌పి ప్రసాద్‌ను ఆదేశించారు.

మాట్లాడుతున్న ఎస్‌పి ప్రతాప్‌శివ కిషోర్

సిఎం సభకు పటిష్ట బందోబస్తు

ఈ నెల 11న ఆగిరిపల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌పి తెలిపారు. సభాస్థలి ఖరారు కాగానే తగిన రక్షణ చర్యలు చేపడతామన్నారు.

ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలి: కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

రక్తదానం ప్రాణ దానంతో సమానమని, ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలో సోమవారం రక్తదాన శిబిరాన్ని జ్యోతి వెలిగించి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు రక్తం ఎంతో అవసరమని, దాతల నుండి సేకరించిన రక్తాన్ని వారికి అందించి ఎంతోమంది ప్రాణాలను కాపాడుతున్నారన్నారు. ప్రతిఒక్కరూ వారి పుట్టిన రోజు, పెళ్లి రోజు వంటి సమయాల్లో రక్తదానం చేయడం ఒక అలవాటుగా చేసుకోవాలన్నారు. రక్తదానం చేసేందుకు వందలాది మంది యువకులు శిబిరానికి రావడం అభినందనీయమన్నారు. ఒకరి రక్తదానం ద్వారా ఆరుగురు వ్యక్తులను ప్రాణాపాయం నుండి కాపాడొచ్చన్నారు. రక్తం నుండి ప్లాస్మా, ప్లేట్‌లెట్లు, ఎర్ర, తెల్ల రక్త కణాలు వంటి కాంపోనెంట్లు అందించవచ్చన్నారు. జిల్లా సహకార అధికారి ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ 2025వ సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి 'అంతర్జాతీయ సహకార సంవత్సరం'గా ప్రకటించిందని, ఈ కార్యక్రమంలో భాగంగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసాదరావు, డిసిఎంఎస్ బిఎం వివిఎస్.కృష్ణమోహన్, సిబ్బంది సుధాకర్‌రావు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

216-ఎ, 16 జాతీయ రహదారుల్లో

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఏలూరు ఎంపీ విజ్ఞప్తిపై స్పందించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 216-ఎ, 16 జాతీయ రహదారుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లిఖిత పూర్వకంగా తెలిపారు. భీమడోలు, కురెళ్లగూడెం, పూళ్ల, కైకరం, చేబ్రోలు, నారాయణపురం గ్రామాల సమీపంలో గుర్తించిన ఏడు బ్లైండ్ స్పాట్‌ల వద్ద ప్రమాదాల నివారణకు ఫ్లైఓవర్లు లేదా సబ్‌వేలు నిర్మించాలని, సీతంపేట వద్ద ఫ్లై ఓవర్, బాక్స్ కల్వర్టు, ఉంగుటూరు గ్రామంలో ఫ్లైఓవర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మార్చి 11న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలతో కూడిన వినతి పత్రాలను కేంద్రమంత్రికి అందించారు. ఎంపీ మహేష్ కుమార్ విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ బదులిచ్చారు. వినతి పత్రంలో పేర్కొన్న సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు అంశం ప్రభుత్వం పరిశీలనలో ఉందని ఆయన లిఖిత పూర్వకంగా తెలిపారు.

నేరాలు - ఘోరాలు

బాలికపై అత్యాచారయత్నం

పోలీసుల అదుపులో నిందితుడు!

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఇంటి వద్ద ఆడుకుంటున్న మూడో తరగతి చదువుతున్న బాలికపై 56 ఏళ్ల వ్యక్తి లైంగిక దాడికి పాల్పడేందుకు ప్రయత్నించగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు రూరల్ పరిధిలో రత్నప్రసాద్ స్థానికంగా ఆర్‌ఎంపి డాక్టర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం అతని ఇంటికి సమీపంలో ఆడుకుంటున్న బాలికకు మాయమాటలు చెప్పి ఇంట్లోకి తీసుకువెళ్లి తలుపులు వేశాడు. గమనించిన స్థానికులు కేకలు వేయడంతో రత్నప్రసాద్ బాలికను బయటకు పంపించేశాడు. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు తెలిపారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై రూరల్ పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

క్రికెట్ బుకీ అరెస్టు

ప్రజాశక్తి - చింతలపూడి

ఐపిఎల్ బెట్టింగ్ నిర్వహిస్తున్న బుకీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సీతానగరం గ్రామానికి చెందిన నెల్లూరు సతీష్‌ను ఐపిఎల్ క్రికెట్ బెట్టింగ్ ప్రేక్స్ యాప్ ద్వారా నిర్వహిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. అతని ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్న మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ప్రేక్స్ యాప్ ద్వారా మ్యాచ్‌కు రూ.పది వేలు, రూ.20 వేలు, రూ.ఐదు వేలు బెట్టింగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మంటలను అదుపు చేస్తున్న స్థానికులు

మండలంలోని ములగలంపల్లి గ్రామంలో సోమవారం ఉదయం ఉడా శ్రీనివాసరావుకు చెందిన పొగాకు బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ చేస్తుండగా గొట్టంపై కర్ర పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయినా ఫలితం లేకపోవడంతో ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ సహాయంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే బ్యారన్‌లోని పొగాకుతో పాటు సామగ్రి కూడా దగ్ధమైనట్లు బాధితుడు ఆవేదన చెందుతున్నాడు. ఈ ప్రమాదంలో బ్యారన్ సామగ్రితో పాటు రూ.మూడు లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోతున్నాడు.

వివాహిత అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వడాలి గ్రామంలో సోమవారం వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వడాలి గ్రామానికి చెందిన గుండాబత్తిన తిరుపతియ్య కుమార్తె తనుశ్రీని సుమారు రెండేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన బెజవాడ అనిల్‌కుమార్ ప్రేమిస్తున్నానని బలవంతంగా తీసుకెళ్లి పెళ్లి చేసుకున్న విషయంపై గతంలో పోలీసులు కేసు నమోదు చేశారు. తరువాత అతను రిమాండ్‌కి వెళ్లి వచ్చి ఆమె మైనార్టీ తీరిన తర్వాత ఇద్దరు 2024లో అక్టోబర్ 21వ తేదీన ప్రేమ వివాహం చేసుకుని ప్రస్తుతం అదే గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఈ మధ్యకాలంలో అనిల్‌కుమార్ తనకు రూ.20 వేలు అవసరమని, భార్య తనుశ్రీని పుట్టింటికి వెళ్లి తీసుకురమ్మని, అంతేకాకుండా గతంలో తనపై పెట్టిన కేసు రాజీ పడమని వేధిస్తూ కొట్టగా, ఆమె తన బాధ పుట్టింటి వారికి చెప్పుకుని భర్త పెట్టే వేధింపులు భరించలేక సోమవారం ఉదయం ఇంట్లోనే ఉరేసుకుని మృతి చెందినట్లు ఆమె తండ్రి ఇచ్చిన రిపోర్ట్‌పై కేసు నమోదు చేసి ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణకుమార్ దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రైలు నుంచి వ్యక్తి జారిపడి మృతి చెందిన ఘటన భీమడోలు రైల్వే స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్ తెలిపిన వివరాల ప్రకారం... సాయినగర్ షిరిడి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న రాజమండ్రి ప్రాంతానికి చెందిన అమలపు సోమరాజు (45) భీమడలు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జర్వజన ఆసుపత్రికి తరలించారు. రైల్వే ఎస్ఐ సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరిపై బైండోవర్ కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

సారా కేసుల్లో ఇద్దరు వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహశీల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని టి.నరసాపురం మండలంలోని కొత్తగూడెంలో నాటుసారా తయారీ విక్రయాలు చేసిన పాత కేసుల్లో నిందితులుగా ఉన్న ఇద్దరు వ్యక్తులను మండల ఎగ్జిక్యూటివ్, మేజిస్ట్రేట్ తహశీల్దార్ టి.సాయిబాబా ఎదుట హాజరు పరచి బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు ఆర్‌వివిఎల్.నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, కె.జగ్గారావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా కేసులో ఒకరు అరెస్టు

మరొకరిపై కేసు

ప్రజాశక్తి - ముసునూరు

నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సిహెచ్.అజయ్‌కుమార్‌సింగ్ ఆధ్వర్యంలో మండలంలోని చెక్కపల్లిలో సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో తాళం వరలక్ష్మిని అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి రెండు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆమెకు సారా ఇచ్చి అమ్మిస్తున్న ఆమె భర్త తాళం చెన్నారావుపై కేసు నమోదు చేసినట్లు సిహెచ్.అజయ్‌కుమార్‌సింగ్ తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వైవిఎన్ఎస్.ఫణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా స్థావరంపై దాడి

చింతలపూడి :నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నామవరంలో నాటుసారా స్థావరంపై సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో భూక్యా నాగరాజుకు సంబంధించిన ఒక ప్లాస్టిక్ డ్రమ్ములో ఉన్న వంద లీటర్లు పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి, అతనిపై పరారీ కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో చింతలపూడి ఎక్సైజ్ ఎస్ఐలు అబ్దుల్ ఖలీల్, జె.జగ్గరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక సెయింట్ జేవియర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో జరుగుతున్న పదో తరగతి మూల్యాంకన కేంద్రంలో సోమవారం యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో యుటిఎఫ్ ఉంగుటూరు మండల శాఖ ఆర్థిక సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఈ కార్యక్రమంలో పాల్గొని ఉపాధ్యాయులకు మజ్జిగ పంపిణీ చేశారు.

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటే నమ్మొద్దు

అదనపు ఎస్‌పి సూర్యచంద్రరావు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా చెప్తే వారి మాయ మాటలు నమ్మవద్దని, ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలంటే కచ్చితంగా పోటీ పరీక్షల అనంతరం సాధ్యమవుతుందని, ఈ విషయమై అందరూ అప్రమత్తంగా ఉండాలని అదనపు ఎస్‌పి సూర్యచంద్రరావు అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకుని ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందించాలని సంబంధిత పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల్లో కొందరు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని తమను మోసం చేశారని ఫిర్యాదు చేశారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధారణంగా పోటీ పరీక్షల అనంతరం వస్తాయని, ఎవరూ ఇటువంటి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఆన్‌లైన్‌లో సైబర్ నేరగాళ్లు పొంచి ఉన్న నేపథ్యంలో కచ్చితంగా అప్రమత్తంగా ఉండడం ఒకటే మార్గమని సూచించారు.ఈ సందర్భంగా యుటిఎఫ్ చేపడుతున్న కార్యక్రమాలను ఎంఎల్‌సి అభినందించారు.

అంగన్వాడీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ యాక్టివిటీస్‌పై దృష్టి సారించాలని సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శారద అన్నారు. పట్టణంలోని కొప్పులవేలంపేట అంగన్వాడీ సెంటర్‌ను ఆమె సోమవారం పరిశీలించారు. స్టాకు రిజిస్టర్‌ను, పిల్లల భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల పోషకాల పట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఆరేళ్ల లోపు పిల్లలందరికీ ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ తప్పనిసరిగా చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ ధనలక్ష్మి, అంగన్వాడీ టీచర్ పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో జూనియర్ అసిస్టెంట్లుగా ఉన్న ముగ్గురికి సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ ఎ.భానుప్రతాప్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లకు పైగా మున్సిపల్ కార్పొరేషన్‌లో సేవలందిస్తున్న ఎస్‌వివి.రాజారావు, ఓలిపల్లి రవి, తోట మాణిక్యాలరావు ప్రస్తుతం ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ విభాగాల్లో జూనియర్ అసిస్టెంట్లుగా పని చేస్తున్నారన్నారు. వారి అర్హతను గుర్తించి సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో ఉత్తర్వులు ఇచ్చారు.

ఆగిరిపల్లి పిహెచ్‌సి పరిశీలన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రసవాలు ఎక్కువశాతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే జరిగే విధంగా వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు గర్భిణులకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిణి డాక్టర్ మాలిని కోరారు. సోమవారం సాయంత్రం ఆమె డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీనారాయణతో కలిసి ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అందిస్తున్న పలు సేవలను పరిశీలించి సూచనలు చేశారు. డెలివరీ కేసులు ఎక్కువగా నమోదయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పిఒ ఆర్‌బిఎస్‌కె డాక్టర్ నరేంద్రకృష్ణ, ఆగిరిపల్లి వైద్యాధికారులు జె.జగన్మోహనరావు, ఎస్‌కె.టీనా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బిసి కార్పొరేషన్ రుణాల మంజూరుకు బ్యాంకర్లు సహకరించాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

నిరుద్యోగుల స్వయం ఉపాధి యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా బ్యాంకు మేనేజర్లు సహకరించాలని ఉంగుటూరు ఎంపిడిఒ జి.రాజుమనోజ్ కోరారు. నారాయణపురం, ఉంగుటూరు, కైకరం తదితర గ్రామాల్లో ఆయా బ్యాంక్ మేనేజర్లను కలిశారు, గత నెల 25, 26 తేదీల్లో చంద్రన్న స్వయం సోపానం ఇంటర్వ్యూలు నిర్వహించి జాబితాలో బ్యాంకర్లకు పంపించారు. ఈ నెల 11న నూజివీడులో నిర్వహించే సమావేశంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చేతుల మీదగా యూనిట్లు గ్రౌండింగ్ పత్రాలు అందిస్తారని తెలిపారు. ఈ మేరకు త్వరగా యూనిట్లు మంజూరు చేయాలని ఎంపిడిఒ బ్యాంక్ మేనేజర్‌లను అభ్యర్థించారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి ముదినేపల్లి

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముదినేపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వై కూడలి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోడూరు శేషుబాబు, వైస్ సర్పంచి ఈడే సుధాకర్, మాజీ సర్పంచి పామర్తి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి జి.రమేష్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం బస్టాండ్ ఆవరణలో ఏజెన్సీ శెట్టిబలిజ యువజన సంఘం అధ్యక్షులు గుబ్బల సత్యంబాబు, కార్యదర్శి పిల్లి రాజు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన జిల్లా ఇన్‌ఛార్జి కరాటం సాయి మాట్లాడుతూ శెట్టిబలిజ యువజన సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు సేవ చేయడానికి ముందుకొచ్చిన వారందరికీ కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చలపతిరావు, ఎంపిడిఒ జ్యోతి, ఎస్ఐ దుర్గమహేశ్వరరావు, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొండేపాటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహావిష్కరణ

ఉంగుటూరు :ఉప్పాకపాడులో శివాజీ కాంస్య విగ్రహాన్ని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సోమవారం ఆవిష్కరించారు. ఉప్పాకపాడు ఛత్రపతి శివాజీ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్, బిజెపి ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, బిజెపి జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, మండలాధ్యక్షుడు వంజరపు దుర్గారావు పాల్గొన్నారు.

రోడ్డు అంచున మట్టి పోయరూ..!

నిర్మించిన రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయకపోవడంతో వాహనదారుల ఇబ్బందులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మట్టి పోయకుండా వదిలేసిన రోడ్డు అంచు

రోడ్డు నిర్మించిన అధికారులు అంచున మట్టి పోయడం మరిచారని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. మండలంలోని నరసన్నపాలెం నుంచి వేదంతాపురం వరకు సుమారు ఏడు కిలోమీటర్ల రూ.3.10 కోట్ల వ్యయంతో ఆర్‌అండ్‌బి అధికారులు తారు రోడ్డు నిర్మించారు. ఆ రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయకుండా వదిలేశారు. నరసన్నపాలెం, రామానుజపురం, వేదంతాపురం గ్రామాల్లో సిమెంట్ రోడ్డు నిర్మించారు. ఈ సిమెంట్ రోడ్డు అడుగు ఎత్తు వరకు ఉంది. ఇరు వైపులా మట్టి పోయాకపోవడంతో ఒకేసారి రెండు వాహనాలు వెళ్లలేని పరిస్థితి. అధికంగా మలుపులు ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, వెంటనే ఇరువైపులా మట్టి పోయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు నూజివీడు క్రీడాకారులు

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఈ నెల 9 నుంచి 16వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరిగే యూత్ నేషనల్ అండర్ 16 బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు సీనియర్ పీడీ, కోచ్ డాక్టర్ వాకా నాగరాజు తెలిపారు. నూజివీడులో ఆయన సోమవారం మాట్లాడుతూ గుడివాడ నుంచి ఒకరు, నూజివీడు విక్టోరియా క్రీడా మైదానం నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు వివరించారు. నేషనల్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైనవారిలో గుడివాడకు చెందిన డిసి ఆస్టిన్, నూజివీడు పట్టణంలోని విక్టోరియా టౌన్ హాల్ క్రీడా మైదానానికి చెందిన బి.బాలాజీ, బి.ప్రభుదీపిక, ఎస్‌కె.అస్రాలు ఉన్నట్లు తెలిపారు. గత నెల 31 నుంచి చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి కోచింగ్ క్యాంపులో ఈ క్రీడాకారులను ఎంపిక చేసినట్లు చెప్పారు. జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించాలని క్రీడాకారులను ఆశీర్వదించారు.

విద్యార్థుల డైనింగ్ హాల్ ప్రారంభం

నిర్మాణానికి రూ.12 లక్షలు అందించిన ప్రవాసాంధ్రుడు వడ్లపూడి శ్రీధర్

ప్రజాశక్తి - ఉంగుటూరు


డైనింగ్ హాలును ప్రారంభిస్తున్న భారతి

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రవాసాంధ్రుడు భారీ విరాళం అందించడం అభినందనీయమని తాడేపల్లిగూడెం ఉప విద్యాశాఖాధికారిణి నిమ్మగడ్డ రవీంద్ర భారతి అన్నారు. నారాయణపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం విద్యార్థుల కోసం డైనింగ్ హాలు నిర్మాణానికి ప్రవాసాంధ్రుడు వడ్లపూడి శ్రీధర్ రూ.12 లక్షలతో నిర్మించిన భవనాన్ని సోమవారం ఆమె ముఖ్యఅతిధిగా ప్రారంభించారు. ఇదే పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయునిగా దీర్ఘకాలం పనిచేసిన వడ్లపూడి నాగభూషణం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్రీధర్ తన సొంత నిధులతో శాశ్వత డైనింగ్ హాలు నిర్మించారు. మౌలిక వసతుల కల్పనకు దాతల కృషి శ్లాఘనీయమని గ్రామ సర్పంచి దిడ్ల అలకనంద అన్నారు. ఈ హాలులో ఒకేసారి 200 మంది విద్యార్థులు సహపంక్తి భోజనాలు చేసే విధంగా గ్రానైట్ రాళ్లతో బల్లలు ఏర్పాటు ఎంతో ఉపయోగంగా మారనుందని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు కూన రాంబాబు అన్నారు. శ్రీధర్ ఆయన సోదరి కనకమేడల శోభారాణిలను సర్పంచి, పాఠశాల ఉపాధ్యాయులు దుశ్శాలువతో సత్కరించారు. ఉపాధ్యాయులు చేబ్రోలు, నారాయణపురం గ్రామాలకు చెందిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చేబ్రోలులో..

చేబ్రోలు సాయిబాబు ఆలయం వద్ద వడ్లపూడి నాగభూషణం దంపతుల విగ్రహాలను ఆలయ సత్సంగం, పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు, సహచర ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. యెలిశెట్టి పాపారావుబాబ్జి, బొమ్మిడి అప్పారావు, పొన్నం ప్రసాద్, పొన్నం లక్ష్మీనారాయణ, గుత్తా ధనలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ఆదాయంలో రాష్ట్రంలో జిల్లా ప్రథమం

జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాస్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మాట్లాడుతున్న శ్రీనివాస్

స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయంలో రాష్ట్రస్థాయిలో ఏలూరు జిల్లా ప్రథమంగా నిలిచినట్లు జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి కొమ్మినేని శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో 12 సబ్ రిజిస్టర్ కార్యాలయాలు ఉన్నాయన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి రూ.495.11 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా ఇప్పటికే రూ.380 కోట్ల ఆదాయాన్ని రాబట్టగలిగి 70.05 శాతం లక్ష్యాలను చేరుకున్నట్లు చెప్పారు. జిల్లా గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది 17.34 శాతం గ్రోత్ రేటు సాధించడం ద్వారా రాష్ట్రంలోని ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. నూజివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో రూ.60 లక్షల ఆదాయం లక్ష్యం కాగా ఇప్పటికే రూ.55.05 లక్షల ఆదాయాన్ని పొందడం ద్వారా 92 శాతం లక్ష్యాలను సాధించినట్లు చెప్పారు. గ్రోత్ 4.2 శాతంతో గణనీయంగా పెరిగిందన్నారు. జిల్లా స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో 12 సబ్ రిజిస్టర్ కార్యాలయాలు ఉన్నాయని, వీటిలో నాలుగు కార్యాలయాలు మాత్రమే ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయని, మిగిలిన ఎనిమిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే ఉన్నాయని చెప్పారు. పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇరుకైన ప్రాంతంలో ఉండడం వల్ల పార్కింగ్ స్థలాభావం వల్ల అనేక అవస్థలు తప్పడం లేదని జిల్లా రిజిస్ట్రార్ దృష్టికి తీసుకురాగా, ప్రభుత్వ భవనం ఒకటి తమ శాఖకు త్వరలోనే అందించనున్నట్లు చెప్పారు. ఆ భవనం తమ స్వాధీనం చేసేందుకు ఆ శాఖ అనుమతి సాంకేతికపరంగా ఆలస్యమైందన్నారు. ఇప్పటికే ఆ భవనం మరమ్మతుల నిమిత్తం రోడ్లు, భవనాల శాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. మిగిలిన ప్రాంతాల్లో సొంత భవనాల కోసం నిధులు కేటాయించాలని స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ ఐజికి ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన మార్కెట్ వాల్యూ పెంపు ఏలూరు జిల్లాలోనూ కొనసాగిందన్నారు. ఏ విధమైన అవకతవకలను సహించేది లేదన్నారు. అలాంటి ఆరోపణ, ఫిర్యాదులు వస్తే తక్షణమే స్పందించి విచారణ అనంతరం తగిన విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. నూజివీడు సబ్ రిజిస్ట్రార్ ఎ.రాఘవరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డాక్టర్ రోహిత్, ప్రదీప్తి, డెమో నాగరత్నం, మలేరియా సెక్షన్ ఆఫీసర్ గోవిందరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రోహిత్ మాట్లాడుతూ ప్రతిమనిషి ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని, మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యుపిహెచ్‌సి, ఎఎన్ఎం, ఆశావర్కర్లు, జిల్లా మలేరియా కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ :పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఫస్ట్ క్లాస్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మంచి ఆహారం, అలవాట్లతో ఆరోగ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ మాట్లాడుతూ ప్రకృతి సిద్ధంగా భారతీయ సంస్కృతిలో భాగంగా సేంద్రీయ విధానంలో పండించిన ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు ఆరగించడంతో ఆరోగ్యం దినదినాభివృద్ధి చెందుతుందని వివరించారు. వ్యసనాల జోలికి పోకుండా, నిత్య వ్యాయామం, నడక, కొద్దిపాటి కసరత్తులతో దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఎవరికి వారే రక్షణ పొందే అవకాశం ఉందని సోదాహరణంగా వివరించారు. ప్రధానంగా జంక్ ఫుడ్స్‌ను విడనాడాలని, వీటి వల్ల పలు వ్యాధులు వస్తాయని హెచ్చరించారు. అడ్వకేట్ గోపీనాథ్ పాల్గొన్నారు.

చింతలపూడి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు రోజుల అంతర్జాతీయ వర్క్ షాపు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు. మొదటి రోజు సోమవారం నిర్వహించిన వర్క్‌షాపులో పలువురు మాట్లాడుతూ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఎ.నారాయణరావు, వర్క్‌షాపు కన్వీనర్ డాక్టర్ సయ్యద్ మీర్ హసీం, కళాశాల స్థలదాత నందిగం వివేకానంద చౌదరి కుమారుడు నందిగం రాఘవ చౌదరి, డాక్టర్ డి.తులసిప్రియ, డాక్టర్ నవీన్‌చంద్ర (విజయవాడ) పాల్గొన్నారు.

మాల మహానాడు మహిళా అధ్యక్షురాలిగా సునీత

ముదినేపల్లి :ముదినేపల్లిలోని రాష్ట్ర దళిత సంఘాల కార్యాలయంలో రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు డాక్టర్ సేవా నాగ జగన్ బాబూరావు ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలిదిండి మండల మాల మహానాడు మహిళా అధ్యక్షురాలిగా భూపతి సునీత, ముదినేపల్లి మండల మాల మహానాడు ఉపాధ్యక్షురాలిగా సేవా క్రాంతి రేఖకు బాబూరావు నియామక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో గరికిముక్కు రాజేష్, కలంకూరి కమల, భూపతి అశోక్, తాడంకి వరదానం, తదితరులు పాల్గొన్నారు.

ఆటోమొబైల్ వృత్తిదారులకు స్థలాలు కేటాయించాలి

ఎఐటియుసి ఆధ్వర్యాన ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అర్హులైన ఆటోమొబైల్ వృత్తిదారులకు ఆటోనగర్‌లో స్థలాలు కేటాయించాలని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటోనగర్‌లో స్థలాలు ఇవ్వాలని, ఏలూరు నగరంలో షెడ్లు నిర్వహించుకుంటున్న వారిపై మున్సిపల్ అధికారుల వేధింపులు ఆపాలని కోరుతూ ది ఏలూరు ఆల్ ట్రేడ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కలెక్టర్, ప్రభుత్వ అధికారులు స్పందించి ఏలూరు నగరంలో ఆటోమొబైల్ వృత్తిలో కొనసాగుతున్న వారికి తక్షణమే ఆటోనగర్‌లో స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ కన్వీనర్ ఉప్పులూరి హేమశంకర్, బొండాడ హరి నారాయణమూర్తి, కొప్పిశెట్టి వెంకటపతి, కాటూరి శ్రీధర్, గ్రంధి నాగ రవి పాల్గొన్నారు.

రెండో పట్టణ సిఐగా అశోక్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నగరంలో శాంతిభద్రతలు పరిరక్షించేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని రెండో పట్టణ సిఐగా బాధ్యతలు చేపట్టిన కె.అశోక్‌కుమార్ తెలిపారు. ఏలూరు రెండో పట్టణ సిఐ రమణను ఏలూరు రేంజ్ డిఐజి జివిజి అశోక్‌కుమార్ విఆర్‌కు తరలించారు. దీంతో సిఐ అశోక్‌కుమార్‌ను అటాచ్‌మెంట్‌పై ఏలూరు రెండో పట్టణానికి నియమించారు. 2009 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన కె.అశోక్‌కుమార్ గతంలో కూడా నగరంలో ఎస్ఐగా పని చేశారు తూర్పుగోదావరి జిల్లాలో సిఐగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన సైబర్ సెల్ విభాగంలో సిఐగా విధులు నిర్వహిస్తుండగా ఆయనను అటాచ్‌మెంట్‌పై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు నియమించారు.

మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన కొండపల్లి రవి

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్ర ఎక్సైజ్, భూగర్భగనుల శాఖామంత్రి కొల్లు రవీంద్రను టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పశ్చిమగోదావరి జిల్లా బిసి విభాగాల కో-ఆర్డినేటర్ కొండపల్లి రవి విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పలు సమస్యలు వివరించినట్లు కొండపల్లి రవి తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో కార్యకర్తలు అనేక కష్టాలు అనుభవించడమే కాకుండా ఆర్థికంగా కూడా చితికిపోయారని, అలాంటివారిని ఆదుకోవాల్సిన బాధ్యత తెలుగుదేశం పార్టీపై, కూటమి ప్రభుత్వంపై ఉందని చెప్పినట్లు తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రితో మాట్లాడి తనవంతు బాధ్యతగా కార్యకర్తలకు అండగా నిలబడతానని మంత్రి తెలియజేశారని చెప్పారు.

పశువుల కోసం నీటి తొట్టెలు ఏర్పాటు

ముసునూరు : వేసవిలో పశువుల దాహం తీర్చేందుకు గ్రామాల్లో నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తున్నట్లు టిడిపి లోపూడి గ్రామ నాయకులు లక్కపాము కాంతారావు తెలిపారు. మండలంలోని లోపూడిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా రూ.29 వేలతో నీటి తొట్టెల నిర్మాణం చేపట్టేందుకు శంకుస్థాపన చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నారావు, వెంకయ్య, వెంకటరత్నం, రాంబాబు, కృష్ణ, రామ్మోహన్, రైతులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ రామచంద్రపురం 13వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

D.O.P. No. 24/2024

Between:
మురా సురేష్ -పిటిషనర్
AND
మురా అనిత, W/o. సురేష్, C/o. మత్తే అమృతరావు, లూథరన్ చర్చ్ దగ్గర, ఎస్.సి.పేట, సీసలి గ్రామం, కాళ్ళ మండలం, పశ్చిమగోదావరి జిల్లా -రెస్పాండెంట్

నోటీసు

పై నెంబరు గల రెస్పాండెంట్ అయిన మీకు ఎన్నిమార్లు కోర్టు నోటీసులు పంపినను మీరు బుద్ధిపూర్వకంగా తీసుకొనుటలేదు. శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం యీ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయుచున్నాము. సదరు పై నెంబరు D.O.P. గ్రంధములో కోర్టు వాయిదా **ది. 11-04-2025 అయ్యి వున్నది.** కాబట్టి సదరు వాయిదా రోజున మీరు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేటు గారి ద్వారా గాని **ఉదయం 10 గంటలకు** హాజరు అయి ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని పక్షమున మీపై పరోక్షమందు విచారించి తీర్మానం చేయబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

వి.వెంకట్రావు
రామచంద్రపురం పిటిషనర్ తరపు అడ్వకేటు
07-04-25 ఆలమూరు, సెల్: 9989955116

ప్రకటన

In The Court Of The Principal Junior Civil Judge, Bhimavaram

O.S.No. 17/2025

Between:
Plaintiff: Union Bank of India, Bhimavaram Branch Rep by its Branch manager
Defendants:
1. Mis Sowjanya Centring Works Props Penumaka Sowjanya
2. Penumaka Sowjanya

పై నెంబరు దావాలో ప్రతివాదులకు ఎన్నిసార్లు సమన్లు పంపినను అవి అందుకోకుండా కాలయాపన చేయుచున్నారు. వాది తరుపున ప్రతివాదులపై శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసినారు. ప్రతివాదులు **ది. 21-04-2025వ తేదిన ఉదయం 10-30 ని॥లకు** కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను. లేని యెడల శ్రీ కోర్టు వారు మీపై Exparte ఉత్తర్వులు జారీ చేయగలరని తెలియ జేయుచున్నాము.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఆల్తి శివరామకృష్ణ
భీమవరం అడ్వకేట్, శ్రీరాంపురం
తేది:08-04-2025 భీమవరం - 2
సెల్: 98484 60585

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No. 247/2015

Between:
చుండ్రు సుబ్బారావు ...వాది
Vs
గద్దె మంగరాజు వగైరా ...ప్రతివాది

ఈ నెంబరు దావాలో ఏడవ ప్రతివాది ఈదుపుగంటి వీర వెంకట లక్ష్మి భర్త: ప్రసాదరావు, కానూరు, ఉండ్రాజవరం మండలం అనువారు పై నెంబరు దావాలో కోర్టు ద్వారా ఎన్నిమార్లు దావా సమన్లు పంపినప్పటికీ తీసుకొననందున /evade చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు యీ ప్రకటన ఇవ్వడమైనది. కావున సదరు ఏడవ ప్రతివాది ఈడపుగంటి వీర వెంకట లక్ష్మి భర్త: ప్రసాదరావు, కానూరు, ఉండ్రాజవరం మండలం అనువారు పై నెంబరు దావాలో **ది. 09-04-2025వ తేదిన ఉదయం 10-30 ని॥లకు** పైన తెలిపిన కోర్టులో స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పరోక్షమున తీర్మానించబడునని తెలియ పరచడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ధూళిపాళ సూర్య రామారావు
తాడేపల్లిగూడెం పిటిషనర్లు తరపు న్యాయవాది
తేది:06-04-2025 తాడేపల్లిగూడెం